# నిత్యకళ్యాణి

నేను ఆదివారంనాడు పుట్టానుట, కొడుకు పుట్టాలని మా నాన్నగారు ప్రతి రోజు ఉదయం స్నానంకాగానే సూర్యుడికి నమస్కారం చేశేవారట. మా కులంలోని మిగతా వాళ్ళలాగా కాదు. నాకు మా నాన్నగారు తెలుసు. మా అమ్మని వివాహం చేసుకోకపోయినా నాన్నగారు, అమ్మ, పెళ్ళి అయిన భార్యాభర్తలకంటె ఎక్కువ అన్యోన్యంగా వుండేవారు.

నాన్నగారికి ఎన్నో ఆశలు, ఆశయాలు వుండేవి. ఎన్నో కోరికలు వుండేవి. కాని ఆయన జీవింతంలో అదృష్టం ఎప్పుడూ ఆమడ దూరమే. అమ్మకళావంతుల కులంలో పుట్టినా నాన్నగారు మాత్రం పెద్ద కులంలో పుట్టారు. యవ్వనంలో వుండగా అమ్మని ప్రేమించారుట. అమ్మకూడా వారికి మనసు ఇచ్చింది. అంతే ఆ రోజు నుంచి వారిద్దరి మనస్సులో మాటా ఒకటే.

నాన్నగారిని కులంలో వెలివేశారు. ఆస్తికూడా యివ్వలేదు.

"డబ్బు లేనివాడితో ఏం సుఖపడుతావు ? బంగారంలాంటి బ్రతుకు బండలు చేసుకోవద్దు. వయస్సులో నున్నప్పుడు సంపాదించిందే మనకు అక్కరకు వచ్చేది ఈ ప్రేమలతో కడుపు నిండుతుందా ? అని సాటివాళ్ళు అమ్మకు ఒకటికి పదిసార్లు హెచ్చరిక చేశారు.

అమ్మవాళ్ళ మాట వినలేదు. "ఆయనే నాకు సర్వస్వం" అని ఒకటే మాట మీద నిలబడి వుంది.

నిజమే ప్రేమలతో వాళ్ళ కడుపులు నిండలేదు ! పస్తులు వున్న రోజులు కూడా చాలా వున్నాయి. నాన్నగారితో అమ్మగారితో అమ్మ చాలాసార్లు చెప్పింది.

"నాకోసం మీరు సర్వనాశనంకావద్దు. నన్ను మర్చిపొండి మీ వాళ్ల దగ్గరకు వెళ్లిపొండి."

నాన్నగారు ఒక రోజున అమ్మని అడిగారట "నన్ను ప్రేమించటం లేదా సరోజా?"

అమ్మ ఏం మాట్లాడలేదు. ఒక్కసారి ఆయనవంక చూసింది. ఆ చూపులో వెయ్యి అమృత ధారలు వున్నాయి.

వారి ప్రేమల ఫలితమే నేను.

తండ్రి ఏ కులస్థుడైనా మాకు చివరకు వచ్చేది తల్లి కులమేగా ! మాకులంలో పుట్టిన ఆడపిల్లల బ్రతుకులు ఏమిటో అందరికి తెలిసిందేగా.

మా అమ్మ అమ్మకాబోతోందని తెలియగానే నాన్నగారు "స్వామీ ! మా పిల్లలంతా మొగవాళ్ళే కావాలి. మాకు ఆడపిల్లలు వద్దు" అని దైవాన్ని పదే పదే ప్రార్థించారట. అమ్మ కడుపుతోవుందని తెలియగానే నాన్నగారి నాన్నగారు అమ్మకు కబురు చేశారు. నాన్న గారిని వదిలిపెట్టి దూరంగా వెళ్ళిపోతే కోరినంత ధనం ఇస్తావని. ఆరోజుల్లా అమ్మ ఏడుస్తూనే ఉంది. చచ్చిపోతే బాగుండను. అని చాలాసార్లు అనుకున్నది.

కాని నా విషయం గుర్తుకు వచ్చింది. అమ్మ ప్రాణం నిలిచింది. గర్భిణీ స్త్రీలకు జరిగే వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. కాలం గడిచిపోయింది.

నాన్నగారికి స్నేహితుల సహాయంతో కలప వ్యాపారంలో లాభం వచ్చింది. ఆ వార్త చెప్పటానికి నాన్నగారు చాలా సంతోషంగా యింటికి వచ్చారు. "సరోజా, మనకు మంచిరోజులొస్తున్నాయని" అని అంటూ ఇంట్లో అడుగుపెట్టారు. అక్కడ గుమిగూడి ఆడవాళ్ళు ఆయన్ను లోపలికి పోనివ్వలేదు.

నేను పుట్టబోతున్నాను.... అమ్మ ఆశలు, నాన్నగారి పూజను నిష్ఫలం చేస్తూ, ఆడపిల్లను నేను పుట్టాను.

మొగపిల్లవాడు కలిగితే సూర్యనారాయణ అని పేరు పెట్టుకుందామని నాన్న గారి అభిలాష.

నాన్నగారి కోరికలు ఫలించ లేదు. అందులో నేను కూడా వకటి. వరం ఇవ్వకపోయినా ఆయనకు దైవం మీద భక్తి తగ్గలేదు.

సూర్యకుమారి అని నాకు పేరు పెట్టారు.

చీకటి పోయి వెలుగు వచ్చింది. నాన్నగారికి దశ ఎత్తుకుంది. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం. సుమారు నాకు అయిదు సంవత్సరాల వయస్సుంటుంది. ఒక రోజున తెల్లవారుఝామున మేళతాళాలతో ఇంకో ఇంట్లోకి వెళ్లాము. నాన్నగారు పట్టుపంచె కట్టుకుని సూర్యనారాయణస్వామి పటం పుచ్చుకుని అమ్మ ప్రక్కన నడుస్తున్నారు. తలంటుపోసుకున్న జుట్టు ముఖం మీద జారుతున్నాయి. కాళ్లకి పసుపు రాసుకొని మామిడి ఆకులపైన పసుపురాసి కుంకంబొట్టు పెట్టిన కొబ్బరికాయ పుచ్చుకొని నడుస్తోంది.

"ఎక్కడికి వెడుతున్నాం అమ్మా" అని అడిగాను.

అమ్మ ముఖంలో ఆనందంతో పాటు అలసటకూడా కనిపించింది. "మన సొంత యింట్లోకి వెడుతున్నాం పాపా ! నాన్నగారు మనకోసం యిల్లు కొన్నారమ్మా!"

అని అన్నది.

ఆ రోజున మా యింట్లో పెద్ద పండగ జరిగింది. విందుభోజనాలు వేడుకలు జరిగాయి. కాని సాయంకాలం నాన్నగారు చాలా విచారంగా వున్నారు.

నాన్నగారి నాన్నగారు మరణించారని అమ్మదగ్గరకు వచ్చి ఆయనేమన్నారో తెలుసా ! "తల్లీ, తండ్రి లేనివాడినైయ్యాను."

అమ్మ ఆయన్ను చంటిపిల్ల వాడిలాగా దగ్గరకు తీసుకుంది.

నాన్నగారి నాన్నగారు పోయేముందు విల్లురాశారు. ఆస్తినంతా అల్లుడికి రాసి యిచ్చారట. ఆరోజునుంచి నాన్నగారు తరహా మారిపోయింది. తన తండ్రి రాసిన విల్లు చెల్లదని ఆస్తిలో తనకు కూడ హక్కు వుందని దావా వేశారు.

దైవం కూడా నాన్నగారిని చిన్న చూపు చూశాడు. కోర్టు వ్యవహారం సంవత్సరాలు నడిచింది. చివరకు ఆస్తి రాలేదు కాని నాన్నగారికి, వారి సాటివారిలో మనస్పర్ధలు వచ్చాయి. సంపద తరిగింది. కాని నాకు మాత్రం ఒక తమ్ముడు భానుమూర్తి, ఒక చక్కటి చెల్లెలు కమలా వచ్చారు.

పది సంవత్సరాల వయస్సులో నాకు ప్రపంచం తెలియటం మొదలు పెట్టింది, కంచి పట్టుపరికిణి కట్టుకుని స్కూలుకు వెళ్లాను.

నా వంక ఎగా దిగా చూసి మాష్టారు గారు అడిగారు. "మీ నాన్నగారి పేరు ఏమిటి ?"

నేను చెప్పాను.

ఆయన ఎందుకనో నవ్వారు. ఆ నవ్వులో అర్థం నాకు అప్పుడు తెలియలేదు. విషయం అర్థమయ్యేలాగా ప్రక్కయింటి అబ్బాయి చంద్రం నాతో చెప్పాడు.

"మీ నాన్న మీ అమ్మని వుంచుకున్నాడు కాని పెళ్ళి చేసుకోలేదుగా ! మీ కులంలో తండ్రి పేరు తెలియవలసిన అవసరం ఏముందిలే ?"

నాకు వయస్సు పది సంవత్సరాలు నిండకపోయినా ఆక్షణంలో వంద సంవత్సరాలజ్ఞానం ఒక్కసారికలిగింది. చెంప పగిలేలాగ చంద్రాన్ని కొట్టాను. నేనే ఏడుస్తూ ఇంటికి వచ్చాను.

ఎక్కడికో వెళ్ళబోతున్న నాన్నగారు నన్నుచూసి అగారు.

"ఎందుకు తల్లీ ఏడుస్తున్నావు?" అని ఆదుర్దాగా అడిగారు. నేను ఏడుస్తూనే "మీరు మా అమ్మని పెళ్ళి చేసుకోలేదటగా?" అని అడిగాను.

"పాపా!" అంటూ అమ్మ కంఠం వినిపించింది. నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి అమ్మవడిలో ముఖం దాచుకున్నాను. ఎంత ప్రయత్నం చేసినా దుఃఖం ఆగలేదు.

నాన్నగారు వెనక్కి తిరిగి వచ్చారు. నా తలమీద చెయివేసి నిమురుతూ

"తప్పకుండా చేసుకుంటా పాపా ! ఇవ్వాళే చేసుకుంటాం !" అని అన్నారు. ఆ రోజున గుడిలో నాన్నగారు అమ్మని నిజంగానే వివాహం చేసుకున్నారు. అమ్మ మెళ్ళో పెద్ద పెద్ద మంగళసూత్రాలు నల్లపూసలు చూస్తుంటే నాకు ఎంత గర్వం వేసిందో చెప్పలేను.

మరునాడు ఉదయం స్కూలుకు వెళ్ళగానే మాస్టరుగారితో చెప్పాను. చాలా గర్వంతో అభిమానంతో "మా అమ్మని నాన్నగారు నిన్న పెళ్ళి చేసుకున్నారండి" అని చెప్పాను. ఆయన నావంక ఒక్క క్షణం నమ్మనట్టుగా చూశారు. అంతలోనే తెప్పరిల్లుకుని "చాలా సంతోషం తల్లీ !" అని అన్నారు.

ఆరోజు నుంచి నాకు ఎంత ఆనందం ! ఎంతగర్వం ! రాత్రిపూట నిద్దర పట్టనప్పుడు మనస్సులో వెయ్యి ఆలోచనలు వచ్చేవి. అన్నింటికన్న ఆనందం కలిగించే ఆలోచన వేశ్యల కులంలో పుట్టినా మా అమ్మ వ్యభిచారం వల్ల బ్రతకడం లేదు. అంతేకాదు అందరిలాగా నాకు కూడా నాన్న వున్నాడు.

ఆ మంచిరోజులు ఎంత వేగంగా గడిచిపోయాయి.

నా జీవితంలోకి పదునాలుగో వసంత మొచ్చింది.

యవ్వనం నాజీవితంలో అడుగు పెట్టింది.

మా అమ్మ ఎంతో వైభవంగా వేడుకచేసింది. మా కులంవాళ్ళంతా వచ్చారు. రకరకాల బహుమతులు తెచ్చారు. అన్నింటికంటే ఆశ్చర్యం నాన్నగారి చిన్న చెల్లెలు నాకొక చీరె పంపించింది. తెల్లటి పట్టుచీరెకు ఎర్రటి జరీ అంచు.

నాకుఅర్ధంకాని భయం. చెప్పలేని సిగ్గు. దాచుకోలేనంత ఆనందం కలిగాయి. కాని ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. పంకజం మా అమ్మకు చాలా దూరపు బంధువు. వృత్తి చేసి చాలా డబ్బు గడించింది. రెండు మేడలు సంపాదించింది. వేలకు వేలు విలువచేసే జనహరి వుంది. ఇప్పుడు ఆవిడ వృత్తి మానేసినా, ఆవిడ కూతుళ్లు యిద్దరూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఆవిడ నవ్వుతూ మా అమ్మతో ఒక మాట అన్నది.

"నిష్కారణంగా బ్రతుకంతా పాడుచేసుకున్నావు. సరోజా! నాకే ఇటువంటి కూతురు వుంటే కోటికి పడగెత్తనూ ? తెలివితక్కువ ఆలోచన మానేసి ఇకనన్నా హాయిగా బ్రతుకు.... కూటికి గుడ్డకూ బాధ పడుతూ ఏమిటే యీ బ్రతుకూ?"

అమ్మ కంఠం కన్నీరులో క్షణకాలం మూగబోయింది.

"నీకు దండం పెడతాను పిన్నీ ! మమ్మల్ని ఇల్లా బ్రతకనీ. నేను పాపకు పెళ్ళిచేస్తాను. ఆడదానికి ఐశ్వర్యం ఒక్కటేకాదు. తన వాళ్ళంటూ భర్త, పిల్లలు కూడా కావాలి...ఇహ ఇటువంటి మాటలు మళ్ళీ అనవద్దు. ఆయన చెవిన పడితే చాలా బాధపడతారు. "పంకజం యీ మాటలేం పట్టించుకోలేదు." అదృష్టం

లేనివాళ్ళకు మంచిమాటలేం నచ్చుతాయి ? నీ కూతురి వాలకం నాకు తెలియంది కాదు. అది పెళ్ళి చేసుకుని కాపురం చేసుకునేరకమేనా !" అయినా ఒకళ్ళ విషయం నాకెందుకులే అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

నాకు మచ్చెమటలు పోశాయి ! నన్ను వేశ్యను చెయ్యమని అమ్మకు సలహాయిస్తోంది పంకజం పిన్ని. ఎంత దారుణం ! ఎంత అన్యాయం !!

అమ్మా !... అంటూ బిగ్గరగా ఆక్రోశించాను.

దేవతల వరాలు ఫలించవపోవచ్చు. వాని రాక్షసుల శాపాలు మాత్రం ఎంత తేలికగా నిజం అవుతాయి

నాలుగు రోజులు గడిచిపోయాయి నాలుగు యుగాలుగా. ఐదవ రోజున స్కూలుకు బయలుదేరబోయాను.

"పాపా" అంటూ నాన్నగారు పిలిచారు. దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను. ఈ రోజు నుంచి స్కూలు మానేయి !" అని నాన్నగారు అన్నారు. ఈ మాటలు ఆయన నెమ్మదిగానే అన్నా నా మనస్సు మీద వెయ్యి పిడుగులు పడ్డట్లు అనిపించింది.

"ఎందుకని ?" అని అడుగుదామని నా ఉద్దేశ్యం. నేనా ప్రశ్న వేయకుండానే ఆయన సమాధానం చెప్పారు.

"నీకు పెళ్ళి సంబంధం చూస్తున్నాను తల్లీ !"

నాకు నిలువెల్లా సిగ్గు ముంచుకొచ్చింది. ఆ రోజు నుంచి స్కూలు మానేశాను. కొన్ని నెలలు తోచని ఒంటరితనంతో గడిచిపోయాయి. నాన్నగారు నా పెళ్ళి గురించి అహర్నిశలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కాని... ఆయన ఇస్తానన్న కట్నానికి ఆశపడలేదు. లాంచనాలకి మోజు పడలేదు. చివరకు మేము వుంటున్న డాబా పిల్లకు కట్నంగా యిస్తామని చెప్పినా మంచి సంబంధం ఏదీ రాలేదు.

కారణం ! మా అమ్మ కళావంతుల కులంలో పుట్టటమే ! మా కులం వాళ్ళ సంబంధాలు ఒకటి రెండు వచ్చాయి. ఆ రెండు సంబంధాలు నాన్నగారికి నచ్చలేదు. కారణమల్లా ఒకటే... ఈ రెండు కుటుంబాలలోని స్త్రీలు యీనాటికి కూడా వృత్తి చేస్తున్నారు. వాళ్ళ చేతి క్రింద బ్రతకటమే ఈ మొగాళ్ళ పని. నాన్నగారు అన్నమాట ఒకటే. అటువంటి యిళ్ళలో నా కుతురేం కాపురంజేస్తుంది. రోజులు గడుస్తున్నాయి. సంబంధాల కోసం నాన్నగారు ప్రయత్నాలు చేస్తూనే యున్నారు.

చాకలిది తీసుకువచ్చిన బట్టలు పద్దు చూస్తున్నాను. జరీ అంచు తెల్లచీరనాకంట పడింది. మనస్సుకు వెర్రి ఆలోచన వచ్చింది.

నాన్నగారి చిన్నచెల్లెల్ని ఒక్కసారి చూడాలి అమ్మతో చెప్పాను. అమ్మ కొంచెం సేపు ఏమిమాట్లాడలేదు. చివరకు

"నాన్నగారికి కోపం వస్తుందేమో !" అని అన్నది.

మంచిచీరే పంపించిదమ్మా అత్తయ్య" అంటూ నేనేదో చెప్పబోయాను.

"ఒక్క మాట గుర్తుంచుకో పాపా! నాన్నగారు ఒక్కరేనమ్మా మనకు బంధువులు. ఆయన బంధువులు మనకు బంధువులు కారమ్మ. వాళ్ళని మనం వరుస పెట్టి పిలువకూడదు." అంటూ అమ్మ అన్నది. అమ్మ తర్కం నాకు అర్ధం కాలేదు. కాని ఒక్క విషయం మాత్రం నాకు తెలుసు. అమ్మ ఏం చెప్పినా నా మంచి కోసమే చెబుతుంది.

కాని మంచిమాట మనస్సుకి నచ్చదుగా !!!!

నాన్నగారి చెల్లెలు పేరు రంగనాయకి. ఆవిడ మొగుడి పేరు విశ్వేశ్వరరావు వాళ్ళకు మెయిన్‌రోడ్డు మీద పెద్దమేడ వుంది. ఎల్లాగైనా ఒక్కసారి వాళ్ళ యింటికి వెడదామని చాలాసార్లు అనుకున్నాను. కాని నాన్నగారిని అడగాలంటే భయం. అల్లాగేఎన్నో రోజులు మధనపడుతూ గడిపాను. వారాలు, నెలలు గచిపోయాయి. దసరాపండుగ వచ్చింది. దుర్గాష్టమినాడు మేమంతా కలిసి గుళ్ళోకి వెళ్లాం. అమ్మ నాన్న, నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నేను కొబ్బరికాయలు, పువ్వులు పుచ్చుకుని ఆంజనేయస్వామి మందిరం దగ్గర నిలబడ్డాను. ఇంతలో ఎవరో దంపతులు అటువచ్చారు. చాలా భాగ్యవంతులు లాగా కనిపించారు. గుళ్ళోకి వెళ్ళబోతున్న నన్ను చూసి దగ్గరకు వచ్చింది. ఆవిడ చూపులో ఎంతో చల్లదనం వుంది. ఆకళ్ళల్లో ఎంతో ఆపేక్ష కనిపిస్తోంది.

"ఎవరి అమ్మాయివమ్మా పాపా" అని అడిగింది.

నేను నాన్నగారి పేరు చెప్పాను

"మీ నాన్నగారు కూడా వచ్చారా ?" అని అడిగింది. నవగ్రహాల గుడి దగ్గర నిలబడ్డ మా అమ్మనివారికి చూపించాను ఇంతలో ఆవిడ భర్త మా దగ్గరకు వచ్చాడు. ఆవిడేం మాట్లాడకుండా ఆయన వెంట గుళ్ళోకి వెళ్లియింది.

మేము ఆంజనేయస్వామి గుడి దగ్గర కొబ్బరికాయలు కొడుతూవుంటే వాళ్లిద్దరు మాకు మళ్ళీ కనిపించారు.

"వాళ్ళిద్దరూ నీకు తెలుసా" అని అమ్మను అడిగాను అమ్మ మాట్లాడలేదు. నాన్నగారి వంక చూసింది. ఆయన ఒక అరక్షణం తటపటాయించారు. చివరకు మా యిద్దరివంకా చూడకుండా దూరంగా ఆకాశంలోకి చూస్తూ "తెలియదు" అని అన్నాడు. నాన్నగారు నిజం చెప్పటం లేదని నా మనస్సుకు అనిపించింది. ఇంటికి వెళ్ళాక అమ్మని విడిగా పిలిచి అడిగాను.

" ఆవిడేనమ్మా మీ నాన్నగారి చిన్న చెల్లెలు." అని నెమ్మదిగా చెప్పింది. ఎంత

ఆనందం వేసిందో చెప్పలేను. అంతలోనే మనస్సులోకి వెయ్యి ప్రశ్నలు వచ్చాయి.

"నాన్నగారు నాకు అబద్ధం ఎందుకు చెప్పారు ?" ఇదే అన్నింటిలోకి ముఖ్యమైన ప్రశ్న. అంతులేని ప్రశ్నలతో మనస్సు వేసారిపోయింది. మగత నిద్రలో మనస్సుకి ఒక నిశ్చయం వచ్చింది. రేపు ఎల్లాగైనా వాళ్లింటికి ఒకసారి వెళ్ళాలి. మరునాడు ధైర్యం చేసి వాళ్ళయింటికి వెళ్ళాను ముందు వరండాలో నా ఈడు అమ్మాయి నాకంటే పెద్ద అబ్బాయి కనిపించారు. నన్ను చూడగానే నా వంక చాలా ఆశ్చర్యంగా చూశారు. ఆడపిల్ల చూపులో యీర్ష్యవుంది. అబ్బాయి కన్నులలో ఆనందం కనిపించింది.

"రంగనాయకమ్మగారు వున్నారా" అని నేను ఎంతో ధైర్యం చేసి అడిగాను. ఆ పిల్ల ఏం మాట్లాడలేదు. ఆ కుర్రవాడే బదులు పలికాడు.

"లోపలకు రండి. అమ్మను పిలుస్తాను" అని అన్నాడు.

అతను మా అత్తయ్య కొడుకు. నాకు బావ, ఆ అమ్మాయి వాళ్ళ చెల్లెలు...

బావ !!! ఆ మాట తలుచుకుంటేనే మనస్సుకి ఎంత ఆనందం !

నేను వరండాలో కూర్చున్నాను. వాళ్ళ అమ్మను పిలవడానికి అతను లోపలికి వెళ్లాడు. ఆ అమ్మాయి మాట్లాకుండా నా వంక చూస్తోంది.

ఆ కుర్రవాడు తిరిగి వచ్చాడు. గ్లాసులో చల్లటి కూల్‌డ్రింక్ నా ముందు పెట్టాడు. "తీసుకోండి" అన్నాడు.

"ఎవరే వచ్చింది" అని రంగనాయకమ్మగారి కంఠం వినిపించింది. అమ్మాయి సమాధానం చెప్పింది.

"మామయ్య వుంచుకున్న బోగం దాని కూతురు వచ్చిందని" నా చేతిలోని గ్లాసు వెయ్యిసార్లు వణికింది. నాకాళ్ళ క్రిందభూమి క్రుంగిపోతున్నట్లు అనిపించింది. అక్కడ నుంచి దూరంగా పారిపోదామని నా కోరిక. కాని కాలు ముందుకు సాగలేదు. లోపలి నుంచి రంగనాయకమ్మగారి భర్త వచ్చాడు. భయంతో మూగబోయాను. ఆయనే మాట్లాడాడు.

"ఎందుకు వచ్చావు ?"

అత్త రంగనాయకమ్మని చూద్దామని

"ఆవిడతో ఏం పని ?"

నిజమే ఆవిడతో నాకేంపని వుంది ? నేను ఆవిడకేం అవుతాను. మేనకోడలిని కాదు. వాళ్ళ అన్నయ్య వుంచుకున్న బోగందాని కూతురిని అంతేగా ? ఇహ అక్కడ నిలబడలేక వెనక్కి తిరిగాను. ఆయన అన్న మిగతా మాటలు కూడా విన్నాను.

"మీ నాన్న చేసిన నిర్వాకంచాలు. తల ఎత్తుకుని తిరగలేక పోతున్నాం నువ్వు రాకపోకలు కూడా మొదలు పెట్టావంటే మేము యిహ బ్రతకనక్కర్లేదు. ఆయన ఇంకా ఏం చెప్పేవారో ! ఇంతలో మా అత్తయ్య, అదే మా నాన్నగారి చిన్న చెల్లెలు వచ్చింది నన్ను చూసింది. వాళ్ళ ఆయన అన్న మాటలు కూడా విన్నది.

"పాపా" అంటూ ఆవిడ పిలిచింది.

నేనిహ అక్కడ ఒక్కక్షణం కూడా వుండలేక పోయాను. నా కన్నీరు ఎవరూ చూడకూడదు. ఎవ్వరికీ కనిపించకూడదు.

కాని నేను ఇంటికి వచ్చేసరికి ఎదురుగుండా నాన్నగారు కనిపించారు.

"ఎక్కడ నుంచి వస్తున్నావు ?" అని అడిగారు.

నాన్నగారితో ఎన్నడూ అబద్ధం చెప్పలేదు. నిజమే చెప్పేశాను. ఆయన ముఖంలో చాలా బాధ కోపం కనిపించాయి. నాకు చాలా భయం వేసింది.

"పిలువని చోటుకి ఎప్పుడూ వెళ్ళకూడదు పాపా ! అలా వెడితే అవమానం తప్పదు" లోపలకు వెళ్ళాను. అమ్మ చాలా కోపంగా వుంది.

"చెప్పకుండా గుమ్మం కదిలావంటే చీరేస్తాను. జాగ్రత్త"

నేనేం మాట్లాడలేదు. వెళ్ళిపోయినా గదిలో కూర్చున్నాను. అల్లా ఎన్ని గంటలు కూర్చున్నానో లెక్కలేదు.

"కుమారి" అంటూ రుక్మిణి కంఠం వినిపించింది. రుక్మిణి మా పక్కయింటి అమ్మాయి. మా అమ్మదగ్గర సంగీతం నేర్చుకోవడానికి వచ్చేది. మా అమ్మకు బాగా సంగీతం వచ్చు. వీణ వాయిస్తుంది. భజనలు కీర్తనలు చాలాబాగా పాడుతుంది.

రుక్మిణి నాకంటే నాలుగైదు సంవత్సరాలు పెద్దది. చామనఛాయగా వున్నా చూడటానికి చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వాళ్ళనాన్నగారు లేరు. అమ్మ అన్నగారు వున్నారు. అన్నయ్య ఏదో ఊళ్లోఉద్యోగం చేస్తున్నాడు. మా ప్రక్క యిల్లు కొనుక్కొని తల్లి కూతురు వుంటున్నారు. వచ్చిన మొదటి రోజునుంచి మాతో ఎంతోచనువుగా వుండేది. అమ్మని పిన్ని అని నాన్నగారిని బాబాయిగారు అని పిలిచేది. చక్కగా ఎంతో శ్రావ్యంగా పాడేది.

"పాపా!" అంటూ రుక్మిణి మళ్ళీ పలిచింది. ఆ అమ్మాయి గొంతుక వినగానే నా ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించింది. లోపలకు వచ్చి నా గదిలో కూర్చుంది. నాన్నగారు బయటికి వెళ్ళిపోయారు. నేను రుక్మిణీ చాలా సేపు సంగీత సాధన చేస్తూ కూర్చున్నాం.

సాయంకాలం ఎనిమిది గంటలకు కబురు తెలిసింది. మా కలప అడితిలో

అగ్ని ప్రమాదమని, నాన్నగారికి ఆక్సిడెంటు జరిగి హాస్పటలులో వున్నారని అంతా పరుగెత్తుకుంటూ వెళ్ళాం. మా నాన్నగారికి ప్రాణ స్నేహితులు డాక్టరు వెంకటేశ్వరావు గారు నాన్నగారి దగ్గర కూర్చుని వున్నారు.

నాన్నగారు అమ్మతో అన్నమాట ఒకటే " పిల్లలు చిన్నవాళ్ళు జాగ్రత్త ! తరువాత ఆయన ఏమీ మాట్లాడలేదు. మమ్మల్నందర్నీ వదలి చాలా దూరంగా ఎప్పుడూ తిరిగిరాని చోటకు వెళ్ళిపోయారు.

అమ్మ, నేను శిలావిగ్రహాలలాగా కూర్చున్నాం. రాత్రి గడిచింది. పగలు వచ్చింది. నాన్నగారి భౌతికకాయం పంచభూతాలలో కలిసిపోయింది. చివరకు మిగిలిందల్లా ఒక డాబా, రెండువేల రొఖ్ఖం.

అందరూ అమ్మని పరామర్శించారు. అందరూ అమ్మకు సానుభూతి చూపించాక అందరూ అన్ని రకాల మనుష్యులైనా అందరూ చివరకు వేసిన ప్రశ్న ఒక్కటే.

"యిహముందు ఎల్లా గడుస్తుంది."

ఆ ప్రశ్నకు సమాధానం ఎవ్వరూ చెప్పలేక వయారు బంధువులు దూరమైపోయారు. దుఃఖం కూడా రవ్వంత మనస్సుకు దూరమైంది.

కాని ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది.

బ్రతకడం ఎల్లా ?

ఎవ్వరూ సహాయంలేని ఏకాకి జీవితం ఎల్లా గడపటం ? అందరూ దూరమైన మా కుటుంబానికి దూరం కాకుండా నిలచిందల్లా రుక్మిణి వాళ్ళ కుటుంబం. మా యింటి ఎదురుగుండా వన్నమేడలో అద్దెకుంటున్న ఇద్దరు కాలేజి స్టూడెంటు ఉన్న రెండు వేల రూపాయలు చూస్తూవుండగానే ఖర్చు అయిపోయాయి. భవిష్యత్తు భయంకరమైన పీడకలగా కనిపించడం మొదలు పెట్టింది.

నిరాశ ! నిస్పృహ !

ఓ రోజున ఏమీ తోచక రుక్మిణి వాళ్ళ ఇంటికి వెళ్ళాను. నేను వచ్చినట్టు తనకు తెలియదు. ఏదో ఉత్తరం చదువుకుంటుంది. ఉలిక్కిపడి దాచుకోబోయింది. అమ్మాయి ప్రయత్నం చేసిన కొద్దీ నాకు ఉత్తరం చూడాలనే పట్టుదల ఎక్కువైంది. చివరకు మొండితనంగ "చూపించకపోతే నా మీద ఒట్టు" అని అన్నాను.

సిగ్గుపడుతూ ఆ ఉత్తరం నాకు ఇచ్చింది.

అది ప్రేమలేఖ

ఎదురింటి అబ్బాయి రుక్మిణికి రాసిన ప్రేమలేఖ !

వెన్నెల వేడిగా వుందని.. వలపు తియ్యగా ఉంటుందని... విరహం భరించలేనని

ఒంటరిగా తనను జామిచెట్టు దగ్గర కలుసుకోమని.... వలపుల పండించమని ! ఇది అయిదు పేజీల ఉత్తరంలో సారాంశం.

ఆ అబ్బాయి పేరు శివరాం. రెండవ అబ్బాయి పేరు కృష్ణ. ఆ ఉత్తరం చదువుతూ వుంటే నాలో ఏదో అర్థంకాని కలవరం కలిగింది. అది భయం మాత్రం కాదు.

ఎంతో అమాయకుడులాగా కనిపించే శివరాం ఇటువంటివాడా ! రుక్మిణిని గురించి అనుకున్నట్లుగానే నన్ను గురించి కూడా ఇల్లాగే అనుకుంటున్నారా ?

"ఛీ ! ఏం పనులివి !" అని రుక్మిణితో అన్నాను. ఆ పిల్ల భయపడలేదు. సిగ్గు పడలేదు. సరికదా నన్నుచూసి చిలిపిగా నవ్వింది.

"కూపస్థ మండూకానివి ! ప్రేమలో ఎంత మజావుందో తెలుసా" అని పైగా ఎదురు ప్రశ్న వేసింది.

నేనక్కడ క్షణం కూడా నిలువలేదు. పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చేశాను.

శివరాం అమ్మతో మాట్లాడుతున్నాడు. నన్ను చూడగానే చిరునవ్వు నవ్వుతూ "పాపకు ఎప్పుడు పెళ్లి చేస్తారు." అని అడిగాడు.

అమ్మ సమాధానం ఒక పెద్ద నిట్టూర్పు. లోపలికి పారిపోయే దాన్నేమో !కాని యినాడు మాత్రం నాకు అంతులేని కోపం వచ్చింది. అక్కడే నిలబడ్డాను.

ఇంట్లో పిల్లి ఏదో పడతోసింది. అమ్మ హడావిడిగా లోపలికి వెళ్ళింది. నేను ఒక్క అడుగు ముందుకు వేసి "రుక్మిణికి ప్రేమలేఖ రాస్తావా ? సిగ్గు లేదూ ?" అని నెమ్మదిగానే అన్నాను.

అతను ఒక్క క్షణం నిర్ఘాంతపోయి "నీకు రాయలేదని కోపమా ?" అని అన్నాడు.

"పళ్ళురాలుతాయి జాగ్రత్త" అంటూ లోపలికి వెళ్ళిపోయాను.

ఆరోజు నుంచి శివరాం ప్రవర్తనలో ఏదో మార్పు కనిపించటం మొదలుపెట్టింద. మా యింటికి రావడం తగ్గించేశాడు. ఏదైనా పనివుంటే కృష్ణ వచ్చి చేసిపెట్టేవాడు, రక్మిణి కూడా పూర్వమంత చనువుగా మా యింటికి రావటం లేదు. నేను పలుకరించినా ఏదో ముభావంగా వుండేది. చివరకు ఒక రోజున తనే చెప్పివేసింది.

"నీ నోట్లో నువ్వుగింజ దాగదు పాపా !" అని అంది.

ఇలాగే రెండు మూడు నెలలు గడిచాయి. ఒకరోజున మధ్యాహ్నం మా తమ్ముడు, చెల్లాయి బడికి వెళ్లారు. అమ్మ, నాన్నగారి చిన్నచెల్లెలు ఇంటికి ప్రత్యేక మైన పనిమీద వెళ్ళింది.

పాపకు మీరు పెళ్ళిచేస్తే మేము సహాయం చేస్తాం అంటూ విశ్వేశ్వర రావుగారు కబురుచేశారు. అమ్మ మొదట్లోనమ్మలేదు కాని కబురు తెచ్చిన వ్యక్తి ఇంకొక విషయంకూడా చెప్పాడు రంగనాయకమ్మగారికి చాలా సుస్తీగా వుంది అట్టేరోజులు బతకకపోవచ్చును. మిమ్మల్ని ఒక్కసారి చూద్దామనుకుంటున్నారు. అమ్మ ఇహ క్షణం కూడా నిలవలేదు. వెంటనే బయలుదేరి వాళ్ళ యింటికి వెళ్లింది.

నేను ఏమీతోచక రుక్మిణివాళ్ళ ఇంటి వంక చూస్తూ నిలబడ్డాను. అక్కడ చూసిన దృశ్యం చూసి అలాగే నిలబడిపోయాను. దొడ్లో జామచెట్టు దగ్గర శివరాం నిలబడి వున్నాడు. రుక్మిణి మెల్లగా అక్కడికి వచ్చింది. శివరాం రుక్మిణిని గాఢంగా కౌగిలించుకొన్నాడు. చెట్టును పెనవేసుకునే తీగెలాగా అతనూ రుక్మిణీ ఒకటయ్యారు. తన సర్వస్వాన్ని అతనికి రుక్మిణి అర్పిస్తోంది. ఈ దృశ్యం చూడగానే నాకు ఏం జరిగిందో తెలియదు. తెలిసిందల్లా రెండు బలమైన హస్తాలు నా నడుం పెనవేసుకున్నాయి. ఏదో ఎన్నడూ తెలియని అనుభూతి నాలో కలిగింది.

"పాపా !" అంటూ కృష్ణ కంఠం వినిపించింది. అతని కంఠంలో ఎన్నడూ వినని మార్దవం. అతని ముఖంలో ఎన్నడూ చూడని అందం నాకు కనిపించాయి. ఇది పాపం ఇది తప్పు అంటూ ఏదో అస్పష్టవాణి నా మనస్సుకు హెచ్చరిక చేసినా నా శరీరం మాత్రం నా మాట వినలేదు.

ఈ అంతులేని ఆనందం, ఎన్నడూ తెలియని యీ సుఖమేదో రుచిచూడాలని నా మనస్సుకు ఎదురు తిరిగింది.

"పాపా" అంటూ కృష్ణ కంఠం మళ్ళీ వినిపించింది. నేను కళ్ళు మూసుకుని నా రెండు చేతులు అతని కంఠానికి పెనవేశాను.

అంతే !!!

ఆ ఏకాంతంలో, నా సర్వస్వాన్ని అతనికి అర్పణ చేసుకుంటున్నా ఆ మధుర క్షణంలో ప్రకృతి స్థంభించి పోయినట్లు అనిపించింది. కాలం ఆగితే బాగుండును. ఎప్పుడూ యిల్లాగే వుంటే బాగుండును అని మనస్సు పదేపదే కోరుకుంది.

కాని యీ కల కరిగేసరికి అమ్మ మా యిద్దరి ఎదురుగుండా నిలబడివుంది. అప్పటికే నేను సర్వస్వం పోగొట్టుకుని సర్వనాశనం పొంది వున్నాను.

ఆ ఆనందమంతా ఏమైయిందో ? ఆ సుఖమంతా ఏమైయిందో ? మిగిలినదల్లా నేల రాలిన అమ్మ ఆశలు, నేరం చేశామనే చెరిగిపోని భావన.

ఏం జరిగిందో నాకు తెలియదు తెలిసిందల్లా కృష్ణ అక్కడ లేడని స్పృహలేకుండా అమ్మ నేల మీద పడివుందని.

నాకు దుఃఖం ఆగలేదు. "అమ్మా!" అంటూ నేల మీద కూలబడ్డాను. రుక్మిణీ ఎప్పుడు వచ్చిందో నాకు తెలియదు. అమ్మ ముఖం మీద నీళ్ళు జల్లుతోంది. నేను మోకాళ్ళమీద తన ఆనించుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

అమ్మకు స్పృహరాగానే అన్నమాటలు "ఆ పాపిష్టిదాన్ని నా కంట పడవద్దని చెప్పు."

"పిన్నీ !" అంటూ రుక్మిణి పిలిచింది.

"దాన్ని ఇంట్లోంచి వెళ్ళిపోమను. "ఒక్క క్షణం కూడా వుండటానికి వీలులేదు" అసలేం జరిగింది ?"

దీనికొక మంచి సంబంధం చూశామని పెళ్ళి ఖర్చులు పెట్టుకుంటానని రంగనాయకి కబురు చేస్తే వెళ్ళాను. లక్షణమంటి సంబంధం. పెళ్ళి చూపులకి ఎల్లుండి మంచిరోజు రమ్మని కబురు కూడా చేశాం. పట్టలేని సంతోషంతో ఇంటికి వచ్చాను. రాకపోయినా బాగుండేది.

"అప్పుడేం జరిగింది ?"

"జరగ కూడనిదే జరిగింది. వేశ్యల కడుపున సంసారుల పుడతారా ! నా కడుపునా వేశ్యే పుట్టిందమ్మా."

రుక్మిణి ఆశ్చర్యంగా నా వంక చూస్తోంది. ఆ చూపులో ఎంత అసహ్యం వుందో నేను చెప్పలేను. పరుగెత్తుకుని వెళ్ళి నా గదిలో తలుపు వేసుకున్నాను.

పిచ్చిదానిలాగా ఏడుస్తూ ఎంతసేపు గడిపేసానో నాకు తెలియదు.

అమ్మకూడా నన్ను పిలవలేదు.

మనస్సుకు ఒక వెర్రి ఆలోచన వచ్చింది. ఒక ధృఢ సంకల్పం నాలో రూపం దాలుస్తోంది. ఆ గది అంతా నా కన్నులు దేనికోసమో వెయ్యిసార్లు వెతికాయి.

ముందు భయం వేసింది. కాని ఏదో మొండి ధైర్యం నాలో ఆవేసించింది.

ఏడుస్తున్నదానినల్లా ఒక్కసారి పెద్ద పెట్టున నవ్వాను.

కొద్ది క్షణాలలో యీ పాపిష్టి బ్రతుకుకు భరతవాక్యం... నల్లుల మందుతోనా కథ కూడా కంచికి వెడుతుంది.

కాని ఎక్కడో పిడుగు పడ్డ తరువాత మెరుపు మెరిసింది. నా గది తలుపు గడియ భళ్ళున విరిగి ఒక్కసారి రెక్కలు తెరుచుకున్నాయి.

డాక్టరు వెంకటేశ్వరరావుగారు నిలబడి వున్నారు. ఆయనేం మాట్లాడలేదు. నాచేతులలోని సీసా తీసుకుని తన మందుల సంచిలో వేసుకున్నారు. నా చెయ్యి పుచ్చుకొని సావిట్లోకి నడిపించుకుని వచ్చారు.

ఆ ప్రయత్నంగా నా చూపు ఎదురు ఇంటి మేడ మీదకు వెళ్ళింది. అమ్మ మాటలు కొరడా దెబ్బలులాగా తగిలాయి.

“వాళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారు.”

నేనేం మాట్లాడలేదు అమ్మపాదాలు పట్టుకుని ఏడుస్తూ “నన్ను క్షమించమ్మా” అని అన్నాను.

అమ్మ ఏం మాట్లాడలేదు. ఆవిడ కన్నీరు నాకు కనిపిస్తూనే వుంది.

అనాటి నుంచి యీనాటి వరకూ పెళ్ళి చూపులకు ఎవ్వరూ రాలేదు.

నేను చేసిన ఘనకార్యం మా వాళ్ళందరి తెలిసిపోయింది. వళ్ళు అమ్ముకుని బ్రతికే కులమైనా మాకూ నీతి నియమం వున్నాయిగా, అందుకనే మా కులంలోని మగవాళ్ళెవ్వరూ ముందుకు రాలేదు.

డాబా తాకట్టు పెట్టి అమ్మ చెల్లాయి పెళ్ళి చేసేసింది. తమ్ముడు స్కూలు ఫైనలు పూర్తి చేసి బెజవాడలో ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోయాడు.

అమ్మకు తోడుగా నేను, నాకుతోడుగా దురదృష్టం మిగిలాం !

నాకు ఇరవై సంవత్సరాలు నిండిన రోజున డాబా అమ్మేసి అప్పులు తీర్చేశాం.

అన్నీ పోయి మేము ఇద్దరం మిగిలాం. పస్తులు? కటిక దరిద్ర్యం. అంతా వదిలి వెళ్ళిపోయినా ఇదిమాత్రం నన్ను వదలి వెళ్ళలేదు.

చీకటిలో వెలుగులాగా, ఎండలో నీడలాగా పంకజం పిన్ని వచ్చింది. “జరగవలసిందేదో జరిగిపోయింది. ఏడుస్తూ కూర్చుంటే ఏం లాభం సరోజా ! బంగారంలాంటి పిల్లని యింట్లో వుంచుకుని పస్తులు పడుకుంటున్నావంటే నిన్ను చూసి జాలి పడలో నీ తెలివితక్కువ తనానికి నవ్వాలో తెలియటం లేదు. ఈ జన్మలో దానికి పెళ్ళి జరగడం కల్ల. వృత్తిచేసుకోవడం మనకు తప్పుకాదు. నేనొక చల్లటి మాట చెబుతాను విను. ధర్మారావుగారికి అమ్మాయి మీద మనస్సుందట. ఎప్పటి నుంచో నన్ను వేధించుకు తింటున్నాడు. అమ్మాయిని మాట్లాడి పెట్టమని మీ బ్రతుకులు వైభవంగా వెళ్ళిపోతాయి.

“ఎవరు ఆయన ?” అని అమ్మ అడిగింది.

“ఎవరైతే మనకేం ? ఆయనకు పెద్ద వ్యాపారం వుంది కోరినంత డబ్బుఇవ్వటానికి సిద్ధంగా వున్నాడు. మిగతా విషయాలు మనకెందుకు ?”

అమ్మ ఏం మాట్లాడకుండా నా వంక చూసింది. నేనేం చెబుతానో విందామని ఆసక్తిగా పంకజం పిన్ని చూస్తోంది.

“నాకు ఇష్టమే” అని అన్నాను.

ఆరోజు నుండి ఒక నూతన జీవితం ప్రారంభమయింది. మా యింటి ఖర్చు అంతా ధర్మరావుగారే భరించేవారు. ఎప్పుడో కాని మా ఇంటికి వచ్చేవారుకాదు. ఎవరినన్నా వెంటపెట్టుకుని వచ్చేవారు. ఆ వెంటవచ్చిన వారి కోర్కెలు తీర్చడం నా పని.

రోజులు యుగాలలాగా కాకుండా క్షణాలుగా గడపటం మొదలు పెట్టాను. నాకు మంచి మంచి చీరెలువచ్చాయి. ఒక రెండు బంగారు నగలు కూడా వచ్చాయి. తిండికిబట్టకు లోపం లేదు. లోపమల్లా మనస్సుకే. ఒంటరిగా వున్నప్పుడు మనస్సును మధనం చేసే తీరని కోరిక ఒకటే.

నాకు జన్మలో పెళ్లికాదు.

నాకు సంఘంలో ఎటువంటి గౌరవం వుండదు.

నన్ను ఎవరింటికీ పిలవరు !

తమ అవసరం కోసం నన్ను ఉపయోగించుకునే వారేకాని నన్ను ఎవ్వరూ ప్రేమించరు. నేను ఎవ్వరికి అక్కర్లేదు.

బురదకాళ్ళు తుడుచుకునే కొబ్బరి పీచును నేను. అంతే ! నా బ్రతుకుకు అంతకంటే పరమార్థం లేదు.

ఒకరోజున డాక్టరు వెంటేశ్వరరావు గారి డిస్పెన్సరికి వెళ్ళాను. రంగనాయకమ్మ గారి అమ్మాయి కనిపించింది. నన్ను చూసిముఖం ప్రక్కకు తిప్పుకుంది. కాని నేనే పలుకరించాను.

"అమ్మగారు కులాసా ?" అని అడిగాను. ఆ ప్రశ్నకు ఆ అమ్మాయి ముఖం ఒక్కసారి గంభీరంగా మారిపోయింది. కనురెప్పల చాటున కన్నీరు కనిపించింది. పెదవులు వణికాయి తల వంచుకుని మెల్లిగా 'అమ్మ పోయింది' అని అన్నది.

"ఎప్పుడూ ?" అని అడుగుదామని నా ఉద్దేశ్యం. కాని ఎందుకనో మనస్సు మూగబోయింది.

"నువ్వు మీ నాన్న కలిసి మా అమ్మని చంపేశారు." అని అన్నది. అంత దుఃఖంలోనూ నాకు వలమాలిన ఆవేశం వచ్చింది.

"ఉరిశిక్ష వేయించు' అని అన్నాను.

"ఇప్పుడు అనుభవిస్తోంది అదేగా" అని ఆ పిల్ల అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

నేను స్థాణువులా నిలబడిపోయాను.

"పాపా !" అంటు డాక్టర్‌గారి కంపౌండర్ పిలిచాడు. మందుసీసా నా చేతికి యిస్తూ.

సారా వ్యాపారం బాగా సాగుతోందా ?

నేను ఆయనవంక ఆశ్చర్యంగా చూశాను.

మీ ఆయన చేసేది సారా వ్యాపారమేగా !!!

మీరేమంటున్నారో నాకు తెలియదు.

తెలియనట్టు మాట్లాడకు.

నాకు నిజంగానే తెలియదు.

దొంగసారా వ్యాపారంలో రాష్ట్రం మొత్తం మీద మొనగాడు ఆయనేగా.

నాకు కాళ్ళ క్రింద భూమి కృంగిపోతోంది. పేరు ధర్మారావు. చేసేది దొంగసారా వ్యాపారం ఆతప్పుడు పనులు కప్పిపుచ్చుకోవడానికే వాళ్ళకి వీళ్ళకి నన్ను అర్పించడం.

ఎంతనీచంగా దిగజారిపోయింది నా బ్రతుకు. మందు విషయం మరచిపోయి. ఇంటికి వడివడిగా వచ్చేసాను అమ్మతో చెప్పకూడదనుకున్నాను. కాని చెప్పకుండా వుండలేక పోయాను. ఆ రోజంతా అమ్మ ఏడుస్తూనే వుంది.

మరునాడు ధర్మారావు ఒక్కడే వచ్చాడు.

"హైదరాబాదు వెడదాం వస్తావా ? అని అడిగారు.

"దొంగసారా వ్యాపారస్తులతో నేను రాను" అని అన్నాను.

ఆయన ఒక్కక్షణం మాట్లాడలేదు. చివరకు "ఎవరు చెప్పారు?" అని అడిగారు.

"ఒకళ్ళు చెప్పేదేమిటి లోకం కోడై కూస్తోంది.,"

చూడుపాపా ! నేను బయట ఎటువంటి బ్రతుకు బ్రతికితే నీకేం ? నిన్ను ప్రేమగా చూసుకుంటున్నానా లేదా ?

నాకు కన్నీరు ఆగటం లేదు కాని పెద్ద పెట్టున నవ్వాను.

"ప్రేమ ! ఇదేనా ప్రేమంటే .... మీకు లాభం కలిగించే వాళ్ళ దగ్గరకు నన్ను పంపించడమేనా మీ ప్రేమ? ఇదేనా మీకు నా మీద వున్న ఆదరణ ? గౌరవం ?"

ఆయన ఏమీ మాట్లాడలేదు పర్సు తెరిచి మూడువందల రూపాయల కాగితాలు రేడియో బల్లమీద పెట్టారు. చిరునవ్వుగా నా వంక చూస్తూ కట్టుకున్న పెళ్ళాం కన్న ఎక్కువగా పోట్లాడుతున్నావే ? అన్నారు."

నాకు నిలువెల్లా భగ్గుమంది.

మన ఇద్దరి రంకు పురాణం వివాహబంధం ఎల్లా అవుతుంది? నేను భోగం దాన్ని, మీరు సరసులు .... కాదు... కాదు. ఢాఫర్ ! బ్రోకర్!

నన్ను నరికేద్దామన్నంత కోపం ఆయనకు వచ్చింది. కొట్టడానికి చేయి పైకి లేచింది.

"కొడితే పడివుండడానికి నేనేం కట్టుకున్న పెళ్ళాన్ని కాదు." అని అన్నాను. ఆయన వెళ్ళిపోయారు. మళ్ళీ మా యింటికి రాలేదు.

ఆవేశాలు తగ్గిన తరువాత అమ్మ రాయబారానికి వెళ్ళింది. "జరిగింది మరచి పొండి. మళ్లి మామూలుగానే వస్తూ వుండండి" అని ఆయనతో విన్నవించుకుంది.

సమాధానంగా ఒక వెయ్యి రూపాయలు వచ్చాయి. అప్పుడే యింకొక విషయం కూడా తెలిసింది.

ఆయన పుష్ప అనే అమ్మాయిని చేరదీసి యింట్లోనే వుంచుకున్నారని, మాకు ఇహ తెగతెంపులేనని.

ఆ మాటవిని నేను ఏడుస్తూ కూర్చున్నాను.

అమ్మ మాత్రం చిరునవ్వు నవ్వి "ఎందుకే ఏడుస్తావు?" దేశమేం గొడ్డుపోలేదు. ఈయన కాకపోతే ఇంకొక ఆయన."

మా అమ్మేనా ఇల్లా మాట్లాడుతోంది అని ఆశ్చర్యపోయాను.

"అమ్మా!" అని అన్నాను.

అమ్మమాత్రం ధైర్యంగా "ఇంత కన్నామనం చెడిపోయేది ఏం లేదమ్మా" అని అన్నది.

చరిత్ర యింకొక మలుపు తిరిగింది. జీవితంలో యింకొక అధ్యాయం ప్రారంభమైంది. మా వూరిలో నా పేరు తెలియని వాళ్లులేరు.

అందరికన్నా అందమైన మనిషి ఎవరు ?

సూర్యకుమారి...

అందరికన్నా రసికురాలు ఎవరు?

సూర్యకుమారి !

అందరికన్నా ఖరీదైన మనిషి ఎవరు ?

సూర్యకుమారి

ఎవరి నోట విన్నా యిదే మాట. ఎవరి మనస్సులో చూచినాయిదే పాట. రిక్షాలలో వచ్చే వారికంటే కార్లలో వచ్చేవారి సంఖ్య పెరిగింది. మూడు అంకెల రేటు నాలుగు అంకెలయింది. అసలుతోబాటు రవ్వంత కొసరులేందే వూరుకునే దాన్ని కాదు.

"డబ్బు శాశ్వతంకాదు. మీకు గుర్తుగా ఏదైన వస్తువు మా యింట్లో వుండాలి." అని గోముగా, లాలనగా అడిగేదాన్ని. అంతటితో ఆ మగరాయుడు తబ్బివుబ్బిబ్బై నన్ను లాలించి, చెల్లించి నా మనస్సులోని కోరిక ఏదైన సరే తీర్చడానికి

వెనుకాడేవాడు కాదు. అంతేకాదు లిప్తకాలంలో నా ముద్దు మురిపెంతీర్చేవాడు.

ఒక సరసుడు సీలింగ్‌ఫ్యాన్ ఇచ్చాడు. ఇంకొక గవర్నమెంట్ ఆఫీసరు రేడియో గ్రామ్ కొని పెట్టాడు. ఒక డబ్బున్న పిచ్చివాడు డన్‌లప్‌బెడ్ కొని యిచ్చాడు. డబ్బులేని పేద విద్యార్థి పస్తులుండి ఒక చక్కటి టేబిల్ లైట్ కొని యిచ్చాడు.

పేరు మోసిన ఒక కళాకారుడు నాకోసం ఒక పెయింటింగ్ వేసి యిచ్చాడు. కుర్చీలు బీరువాలు ఇహ చెప్పనక్కర్లేదు. ఇల్లంతా అవే!!

అందరూ అన్నీ యిచ్చారు. కాని ఇవ్వనిదల్లా నేను అడగనిదల్లా ఒకటే ప్రేమ!

నాకు ఎవ్వరూ తమ ప్రేమని ఇవ్వలేదు. ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా నిస్పృహ అంతులేని నిరాశ కలిగేది. నా ఎదలోని వ్యథని ఆర్పినవారు లేరు ! తీర్చిన వారు లేరు.

ఆ రోజు శనివారం పగలల్లా ఉపవాసం చేసి సాయంకాలం వెంకటేశ్వరస్వామి మందిరానికి వెళ్ళి తిరిగివచ్చాను. అమ్మతో ఎవరో మాట్లాడుతున్నారు. నేను తలవంచుకుని నా గదిలోకి వెళ్ళిపోతున్నాను.

"పాపా !" అంటూ అమ్మ పిలిచింది. ముందుకు వెడుతున్నదాన్నిఆగాను.

"నీతో మాట్లాడటానికి వచ్చారు" అని అంది. ఆయనవంక చూశాను. ఒక వెల యాలికోసమని వేలు ఖర్చు చేసే వెర్రి వాడులాగా కనిపించలేదు.

వేశ్యల యిళ్లు వెతుక్కుంటూ వచ్చే సరసుడులాగా కూడా లేడు కాని అతనితో ఏదో చెప్పలేని గొప్పతనం వుంది. మాట్లాడకుండా కూర్చున్నాను.

"మీకు స్టేజి అనుభవంలేదని నాకు తెలుసు. కాని ఒక గొప్ప ఆర్టిస్టు కావలసిన యోగ్యతలు లక్షణాలు అన్నీ మీలో ఉన్నాయి."

నేను చిరునవ్వు నవ్వాను. నిజమే మా కంటే గొప్ప నటులు ఎవరున్నారు. తీరని వ్యథలతో సతమతమయ్యే తరుణంలో కూడా సరసుడిని చూడగానే ప్రేమ నటించాలి, శృంగారం చిలికించాలి. అతనే రసికులకి రారాజు అన్నట్టుగా హావభావాలు చూపించాలి. చూపించడమే కాదు. అది అంతా నిజం అని ఆ దౌర్భాగ్య శిరోమణి నమ్మేలాగా చెయ్యాలి.

నిజమే మాకంటే చక్కగా నటించగల వాళ్లు ఎవరున్నారు?

"నాటక కళాపరిషత్తుకోసమని మేము ప్రత్యేకంగా ఒక నాటకం రాయించాం. దాంట్లో హీరోయిన్ వేషం మీ కోసమనే ప్రత్యేకంగా కవిగారు రాశారు. మీరు కాదనకుండా ఆ వేషం వెయ్యాలి. మన వూరి పరువూ ప్రతిష్ఠ నిలబెట్టాలి."

నేను పక్కున నవ్వాను. పరువు ప్రతిష్ఠా పోయినదాన్ని నేను ఒకరి పరువు నిలబెట్టడం ఏమిటి ?

"స్టేజి అనుభవం లేదని మీరు సంకోచపడవద్దు మేము అన్ని విధాల తరిఫీదు ఇస్తాము మీరు వేషం వెయ్యండి ప్రైజులన్నీమనవే !"

"ఏమిటా నమ్మకం ?"

"మీరు యీ నాటకం చదవండి. నేను చెప్పడందేనికి మీకే తెలుస్తుందిగా. కవిగారు మీకోసమే యీ నాటకం రాసారని మీరే ఒప్పుకుంటారు. నే ఎల్లుండి వస్తాను. ఈ లోపల మీరు నాటకం చదవండి. మీ అభిప్రాయం చెబుదురు గాని. ఆరాత్రి నాటకం చదివాను. జీవితం ఇంకొక మలుపు తిరిగింది."

రెండు రోజుల తరువాత ఆయన వచ్చాడు. అడగకుండా నేను చెప్పాను.

"నాటకంలో వేషం వేస్తాను."

"ఇహ ప్రైజులన్నీ మనవే" అని ఆయన అన్నాడు.

ఆనాడు ఒక నూతన జీవితానికి నాంది. రోజు నాటకం రిహార్సల్‌కు వెళ్ళేదాన్ని. అక్కడి వాళ్లంతా నన్ను వెలయాలుగా కాకుండా ఒక మనస్సున్న మనిషిగా చూశేవారు. అంతకన్నా నాకు ఏం కావాలి.

వెన్నెల వేళలో నాకోసం వెంపరలాడే సరసులని దూరంగా వుంచడం మొదలుపెట్టాను.

అదేమి కర్మోనాకు తెలియదు. నేను దూరం అవడానికి ప్రయత్నం చేసిన కొద్దీ నా రేటు పెరగసాగింది.

మా వూళ్ళోని మార్వాడి లక్షాధికారి ఏకైక పుత్రుడు ఒకచీకటి రాత్రి మంచి ముత్యాల దండ కానుకగా తీసుకుని మాయింటికి వచ్చాడు.

నాకు తీరిక లేదన్నాను.

"నజరానా చాలలేదా ?" అని అడిగాను.

నాటకం రిహార్శల్‌కు వెళుతున్నాను. వీలు లేదన్నాను.

"బుల్ బుల్" రెండు వేలు చాలా పెద్ద మొత్తం.

"సారీ !" అని అక్కడ నుంచి వెళ్లిపోయాను.

నేను రిహార్సలు దగ్గరకు వెళ్ళేసరికి జనం చాలా హడావిడిగా వున్నారు.

"ఏమిటి విశేషం ?" అని అడిగాను.

'మురళీమోహన్‌గారు వస్తున్నారు" అని అన్నారు.

వాళ్ళ హడావిడి చూసి నాకు నవ్వు వచ్చింది. ఆయనేమన్నా పెద్ద గవర్నరా ? వీళ్ళంతా ఇంత హడావిడి పడుతున్నారు అని అనుకున్నాను.

నాటకం సెట్టు అంతా చక్కగా ఏర్పాటుచేశారు. ఒకటికి పదిసార్లు ప్రతిది సరిదిద్దుకున్నారు.

ఆయన వచ్చాడు. అందరూ ఆయనకు ఘనస్వాగతం ఇచ్చారు. నాకు మాత్రం ఆయనను చూడగానే అంతులేని భయం వేసింది.

అందమైన రౌడీలాగా వున్నాడు.

అందరివంకా ఒక్కసారి పరకాయించి చూసి నా వైపు చూశాడు. చూపు క్షణం నిలిచింది. ఆ చూపులో ఆశలేదు. వెంపరలేదు. నిశ్శబ్దం వుంది. ఎవరన్నట్టుగానా పక్కనున్న వ్యక్తి వంక చూశారు.

"హీరోయిన్" అని సమాధానం వచ్చింది.

"పేరేమిటమ్మా" అని నన్నే అడిగారు.

"సూర్యకుమారి" అని సమాధానం చెప్పాను.

"ఐతే నీతో కలిసి ముగ్గురన్న మాట !"

నాకు అర్థం కావటం లేదు ఆశ్చర్యం కూడా కలిగింది.

"సూర్యకుమారి అనే పేరున్న స్టేజి ఆర్టిస్టులు ఇప్పటికి యిద్దరున్నారు. నువ్వు మూడోదానివి. కొద్దిక్షణాలు ఏదో ఆలోచిస్తూ నిలబడ్డారు. ముఖంలో చిరునవ్వు కనిపించింది.

" ఈరోజు నుంచి నీ పేరు సుజాత" అని అన్నారు.

నాకు నవ్వొచ్చింది. భయం కూడా వేసింది.

ఆయన కూడా నవ్వుతూ "పేరు బాగుంది కదూ!" అని అన్నారు.

ఆ చిరునవ్వులో ఏదో సమ్మోహనమంత్రం వుంది.

"చాల బాగుందండి" అని అన్నాను. ఆరోజున నాటకం రిహార్సలు పద్ధతే మారిపోయింది. సినిమా చూస్తున్నట్లు అనిపించింది. కలర్ లైటింగ్ టెక్నికల్ ఎఫెక్ట్సల్ బాక్గ్రౌండ్ మ్యూజిక్ వీటన్నింటిలో రిహార్సలు చేస్తూ వుంటే నాకు భయమంతా పోయి ఎనలేని ఉత్సాహం వచ్చింది.

ప్రైజురావాలి అనే పట్టుదల కూడా కలిగింది.

ఆరోజు నుంచి నాకు అదే ధ్యాన, ఆలోచన, మనస్సుకు అదే ఆలాపన !

నాటకం వేసే రోజు వచ్చింది. అన్ని ఏర్పాట్లు జరిగి పోతున్నాయి. మేకప్ చేసుకొని గ్రీన్ రూమ్‌లో కూర్చున్నాను. ఆడిటోరియంలో చక్కని సంగీతం వినిపిస్తోంది. కర్టెను చిల్లులోంచి ఒక్కసారి ఆడిటోరియంవంక చూశాను. గుండె ఆగిపోయినట్టు అనిపించింది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. ఎక్కడ చూసినా

జనం అంతులేని జనం వేలకు వేలున్నారు. వీళ్ళందరి ఎదుటా నేను నటించాలి.

అప్పుడు మనస్సులో వచ్చిన ఆలోచన ఒకటే ఇక్కడనుంచి దూరంగా పారిపోవాలి. ఎక్కడైనా దాకోవాలి.

"సుజాతా !" అంటు ఎవరిదో తియ్యటి కంఠం నన్ను పిలిచింది.

ఉలిక్కి పడ్డాను. మురళీమోహన్ నిలబడి వున్నారు.

"వాళ్ళూ మనలాంటి మనుష్యులే." అని అన్నారు.

నాటకం మొదలు పెట్టారు. పెద్దతుఫానులో చిక్కుకుని ఆశ్రయం లేక బాధపడుతున్నాడు స్టేజీ మీద పాత్రధారి. నేను ప్రవేశించ వలసిన సమయం వస్తోంది. గజగజ వణికిపోతూ సైడ్‌వింగ్‌లోనిలబడ్డాను. చాలా భయంగా వుంది. నోట మాట రావటం లేదు.

"సుజాతా !" అంటూ మళ్ళీ ఆయన కంఠం నెమ్మదిగా వినిపించింది. నాటకం ప్రైజు రావడమో నాశనం కావడమో అంతా నీ చేతిలో వుంది. జాగ్రత్త. భయపడకు మేమంతా వున్నాం గుడ్‌లక్ అని అన్నారు.

అలా ఎందుకు చేసానో నాకు ఇప్పటికి అర్థంకాదు. వంగి ఆయన పాదాలకు నమస్కారం పెట్టాను అంటీ అంటనట్టు ఆయన నాతల మీద చెయ్యివేసి

"పిచ్చిపిల్లా" అని ఆయన అన్నారు.

నాటకం ఎల్లా జరిగిందో నాకు తెలియదు. నాటకం అంతా పూర్తి అయిన తరువాత నటీనటుల పరిచయం చేస్తున్నప్పుడు "కుమారి సుజాత" అని నా పేరు చెప్పినప్పుడు ప్రేక్షకుల హర్షనాదాలు నాకు ఇప్పటికీ వినిపిస్తూనే వున్నాయి. అందరికి నమస్కారం చేసి స్టేజి లోపలకు వెళ్ళాను మా తోటి ఆర్టిస్టులంతా నన్ను ఆకాశానికి ఎత్తేశారు. కాని ఆయన మాత్రం వాళ్ళల్లోలేడు. నా కళ్ళు నామనస్సు ఆయన కోసమే వెతుకుతున్నాయి.

"ఆయన ఏరి?" అని అడగాలని నా కోరిక అడుగుదామని రెండుమూడుసార్లు ప్రయత్నం చేసేను. కాని యింతకాలంగా మరిచిపోయాను. సిగ్గు యీనాడు ముంచుకు వచ్చింది. కాని ఆయన కన్న ముందు ఆయన చిరునవ్వు నాకు కనిపించింది. నన్ను చూసే కాబోలునని ఒక్కక్షణం మురిసిపోయాను మోసపోయాను.

వెయ్యివెన్నెలల అందంలో సాక్షాత్తు మహాలక్ష్మిలాంటి అప్సరస ఆయన వెనువెంట నడచివస్తోంది. చెప్పకుండానే తెలుస్తోంది. ఆయన ఆవిడ సర్వస్వం అని.

ఎందుకనోగానినాలో యీర్ష్య కలిగింది. బాధ కలిగింది. దుఃఖం కలిగింది.

ఆడదానినిగా, అడగకుండానే కన్నీరు తరలివచ్చింది.

ఆయన నా దగ్గరకు వచ్చారు. "సుజాత !" అంటూ పిలిచారు. ఆ పిలుపు లోని అమృతపు జల్లుల కోసం నా మనస్సు వేసారింది.

"నీ నటనను మెచ్చుకుని నీదర్శనం కోసం తహతహలాడే ఒక అభిమానిని నీకు పరిచయం చేద్దామని వచ్చాను."

నేనేం మాట్లాడలేదు.

" ఈ సౌభాగ్యవతి నా జీవితంలోని మధురమైన సగం పేరు పద్మావతీదేవి. ఏడుజన్మలక్రితం నుంచి పరిచయం."

ఆవిడ ముఖం ఆనందంతో మిలమిల లాడింది. బుగ్గలు కెంపువన్నెకొచ్చాయి. కాని నాకు మాత్రం అలవికాని కోపం వచ్చింది.

ఆవిడ నాచేతిని తనచేతిలోకి తీసుకుని "ఎంత అద్భుతంగా నటించావమ్మా" అది నటన అనడానికి వీలులేదు. ఆ పాత్రలో నువ్వు జీవించావనుకో. రిహార్సలు నుంచి రాగానే మా వారు నిన్ను గురించి పొగుడుతూ వుంటే, తోటి ఆర్టిస్టుమీద వుండే గౌరవం కొద్ది అల్లా అంటున్నారేమోననవి అనుకున్నాను. ఆయన చెప్పినదాని కన్నా ఎన్నోరెట్లుబాగుంది. నీవేషం...

రేపు మన వాళ్లందరికి మా యింట్లో విందు. నిన్ను ప్రత్యేకంగా నేనే పిలుద్దామని వచ్చాను."

నేనేం మాట్లాడలేదు మాట్లాడలేను కూడా. నా ఆనందబాష్పాలని దాచుకోలేకపోయాను. ఆ ప్రయత్నంగా నానోటి వెంట వచ్చిన మాట ఒకటే.

"అక్కా!"

ఆవిడ ఉలిక్కిపడ్డట్లు కనిపించింది. నాచెయ్యి వదిలిపెట్టేసింది.

"మిమ్మల్ని అక్కా అని పిలవనివ్వండి" అని ప్రాధేయ పడుతున్నట్లుగా అడిగాను. మబ్బులుతొలిగి మళ్ళీ మందహాసం కనిపించింది.

"అలాగే తల్లీ!" అని అవిడ అన్నది.

మరునాడు రాజసమాన మర్యాదలతో మా అందరికీ విందు జరిగింది. ఆ దంపతులు నామీద చూపిన ఆదరణ, ఆపేక్ష నేను జన్మజన్మలకు మరిచిపోలేను.

పరిషత్తు ముగిసింది. ఫలితాలు తెలిశాయి. మా నాటకానికి బహుమతి రావడమేకాదు నాకు ఉత్తమనటిగా బహుమతి వచ్చింది.

మా సమాజానికి సన్మానం చేశారు. మా అందరి ఫొటోలు పేపర్లో వేశారు. ఆరోజున ఎంతో ఆనందం, ఎంతో గర్వంతో ఇంటికి వచ్చాను.

నేను ఆర్టిస్టుని! నేను ఆర్టిస్టుని! ఆ మాటలో ఎంత ఆనందం వుంది ! ఎంత తృప్తి వుంది.

ఇంటికి వచ్చాను. అమ్మ ఒక చిన్న పెట్టె యిచ్చింది. దాంట్లో ఒక చిన్న ఉంగరం. ఒక చిన్న ఉత్తరం.

"సుజాతా! ఒ కళాకారుడికి ఒక కళారాధకుడు అర్పించిన చిన్న కానుక మురళిమోహన్ !"

మురళీమోహన్!!

ఆ ఉత్తరం ఎన్ని వందల సార్లు చదువుకున్నానో లెక్కలేదు.

నాకు వచ్చిన మొదటిది ఆఖరు స్నేహలేఖ అదే. ఆరోజు నుంచి నేను వేశ్యను కాను వెలయాలిని కాను మురళిమోహన్ అన్నట్లు కళాకారురాలిని.

ఇల్లు, యింట్లోవున్న సామానుల్ని అమ్మేశాను. లక్షరూపాయలకు పైగా వచ్చాయి. బ్యాంకులో డిపాజిట్టు చేశాను.

నేనూ, అమ్మా ఒక చిన్న యింట్లోకి మారాము. అమ్మ మొదట్లో మారాంచేసింది కాని నా నిర్ణయం మార్చలేక పోయింది.

తరువాత అయిదు సంవత్సరాలు. ఊపిరి కూడ తీసుకోవడానికి వీలులేనంత వేగంగా గడిచిపోయాయి. ఎన్ని వందల నాటకాలలోనో నటించాను. పేరు పెన్నిధి లభించాయి. ఎన్నో బహుమతులు వచ్చాయి. ఎన్ని వచ్చినా నా దృష్టిలో అన్నింటి కంటే విలువైనది. ఆయన ఇచ్చిన ముత్యాల ఉంగరం మనస్సులో చాలా సార్లు కోరిక కలిగేది. ఆయన్ను ఒక్కసారి చూడగలిగితేనా అని అనిపించేది.

ఒక వూళ్ళోనే వుంటూ కడా ఆయన్ను నెలలు సంవత్సరాలుగా చూడలేక పోయాను.

అయిదు సంవత్సరాలకుమళ్ళీ మా వూళ్ళో నాటకాల పోటీ జరిగింది. నేను కూడా పాల్గొన్నాను. నేను నటించిన నాటకం అది నాటకం అనడానికి వీలులేదు. నా గడచిన జీవితమే రంగస్థలం మీద అందరికి చెప్పాను వివాహం, భర్త, పిల్లలుకావాలని అనుక్షణం ఆరాటపడుతూనే జీవితమంతా కన్యగా గడిపిన ఒక అభాగ్యురాలి జీవితగాథ అది. ఆ పాత్ర నటిస్తూ ఉంటే గడచిన బాధలగాథలన్నీ ఒక్కసారి స్మృతికి వచ్చాయి. అది రంగస్థలంకాదు! అది నాజీవిత పునర్విమర్శన గడచిపోయిన బ్రతుకు వంక ఒక్కసారి సింహావలోకనం.

జడ్జీలు కూర్చునే చోట నలుగురే కూర్చున్నారు. ఐదకుర్చీ ఖాళీగా వుంది. నాటకం సగంలో ఆయన వచ్చారు. పరిషత్తు కార్యనిర్వాహక సభ్యులు ఆయనను సగౌరవంగా తీసుకువచ్చి కూర్చోపెట్టారు.

మురళీమోహన్!!!

ఆయన కన్నెత్తి నా వంక చూసిన క్షణం నేను మూగదానినైయ్యాను.

లిప్తకాలం డైలాగు మరిచిపోయాను. చూపులతో అంజలి ఘటియించాను. నమ్రతగా తలవంచాను.

ఆయనకూడా నన్ను గుర్తుపట్టాడు. ఆచూపులో స్నేహం వుంది. అపేక్ష ఉంది. ఆత్మీయత ఉంది.

అది ఆనందమో, భయమో, సిగ్గో ఏమో చెప్పలేను. నాటకంలో ఎల్లా నటించానో నాకు తెలియటం లేదు. ఆందరి వల్ల మోసపోయి ఆత్మహత్య చేసుకునే సీను వచ్చింది. సీసాలోని గంగనీళ్ళు గడగడ తాగేశాను. తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. ఎన్ని గంటలు గడిచాయో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలో వున్నాను. మనుష్యులెవరో తెలియటం లేదు. అదే తియ్యటి కంఠం వెయ్యిలోకాల దూరం నుంచి పిలుస్తోంది.

"సుజాతా !"

ప్రయత్నం చేశి చూసాను. మురళీమోహన్

"నన్ను మరచిపోయారా ?" అని అడిగాను.

"పిచ్చిపిల్లా" అని అన్నారు.

ఆయన చేతిని నా చేతిలో పట్టుకుని గుండెల మీద పెట్టుకున్నాను. "నన్ను ఎన్నటికి మరిచిపోవని మాట యివ్వండి."

ఆయన ఏం మాట్లాడలేదు.

నేను కన్నీరు మున్నీరు అవుతూ "నన్ను ప్రేమించటం లేదని చెప్పండి. ఏం అడగను" అన్నాను.

ఆయన ఒక్క ఉదుటన లేచి నిలబడ్డారు. కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడి దూరంగా ఆకాశంలోకి చూస్తూ

"ఎండ మావులతో దప్పిక తీరదు సుజాతా !" అని అన్నారు.

"నాది తీరని కోరికేనా ?"

కాదు... నాప్రేమలో నీకు కూడా భాగం వుంది.

"మళ్ళీ ఒక్కసారి ఆ మాట అనండి. చాలు యీ జీవితానికి అంతకంటే వేపీ ఏమీ అక్కర్లేదు."

కాని ఆ మాటన్నమాత్రాన ఆశలు తీరవు సుజాతా! నిన్ను నీ కళను ఆరాధించగలను కాని నీ ప్రేమని స్వీకరించలేను. ఈ హృదయం, నాలోని సర్వస్వం పద్మావతికి ఏనాడో అంకితమైయ్యాయి. జీవితం నాటక రంగమంత సుఖమయం

కాదు సుజాతా !!! ఆయన కిటికీ దగ్గరే నిలబడి వున్నారు. నా కళ్లు ఒక్కసారి గది అంతా ఎవరినో వెతికాయి.

కుర్చీలో కూర్చున్న పద్మావతిదేవి కనిపించింది. ఆవిడ నా నుదుట మీద చెయ్యివేసి "సుజాత" అని అంది.

నేను వెక్కివెక్కి ఏడుస్తూ "ప్లీజ్ గో ఎవే" అని అన్నాను.

వాళ్ళు వెళ్ళిపోయారు.

నేను మరునాటి నుంచి వేశ్యనయ్యాను.